


## జరిగిన జగన్నాటకం

ఎడమచేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయాడు దళాధిపతి. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. ఆ ద్వీపాన్ని వదిలి వెళ్ళిపోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసే అని ద్వీప చెప్పింది. దళాధిపతితో జరిగిన పోరాటంలో జలపతి మరణించాడు. అయిష్టంగానే నాయకత్వాన్ని మహాబసుకి ఇచ్చేశాడు ఉగ్ర. శాంతియుత పోరాటం ఆరంభమైంది. సవ్యలంక మహాధినేత వామదేవుడు నూటాఇరవై సత్యోద్యమకారులను హతమార్చి, మహాబసు స్పృహతప్పేలా గాయపరిచాడు.

# -11-

"ఎలా వున్నావు బోసు" అన్నదో సుపరిచితమైన కంఠం.

"బాపూ" అన్నాడు బోసు ఆ గొంతు వింటూనే. "నేను బాగున్నాను బాపూ. కానీ పరిస్థితే ఏమీ బాగోలేదు" అన్నాడు ఆయన ప్రశ్నకు సమాధానంగా.

"సత్యం, ధర్మం అని శాంతియుతమైన పోరాటం మొదలుపెట్టావు కదా? ఏమైంది" అడిగాడాయన. ఆయన ముఖంలో చిరునవ్వు చూస్తుంటే అడుగుతున్నట్లు కాక ఏదో గేలి చేసినట్లు అనిపించింది బోసుకి.

"ఏంటి మహాత్మా? వెక్కిరిస్తున్నారా?" అడిగాడు సూటిగానే.

"నేనెందుకు వెక్కిరిస్తానయ్యా? ప్రయత్నం నీది, ఫలితం కూడా నీదే కదా? మధ్యలో నేనేం చేశాను?" అన్నాడాయన.

"మీరు అన్నట్లు ప్రయత్నం నాదే కానీ ఆ ప్రయత్నం వెనుక వున్న స్ఫూర్తి మీదే కదా? మీ సిద్ధాంతాలను అనుసరించే నేను ధర్మయుద్ధం, సత్యోద్యమమం మొదలుపెట్టాను. మీ పద్దతి లోనే అహింసావాదాన్ని అనుసరించాను. ఇప్పుడు ఫలితం భిన్నంగా వచ్చింది కాబట్టి మీకు ఎలాంటి సంబంధం లేదని అనడం భావ్యం కాదు" నిష్ఠూరమాడాడతను.

గాంధీజీ చిన్నగా నవ్వి నెమ్మదిగా నడుచుకుంటూ ముందుకి వచ్చి బోసు దగ్గరగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"పేరు బోసు, అవలంబించే సూత్రం మాత్రం అహింసావాదం. ఇందులో ఏదో తేడాగా అనిపిస్తోందే" అంటుంటే ఆయన ముఖంలో చిరునవ్వు ఇంకా విస్తరిస్తోంది.

"అహింస సిద్ధాంతాన్ని నమ్మని సుభాష్ బోస్ పేరు పెట్టుకోవడం తప్పంటారా? నేను అహింస, శాంతి కోరుకోవడం కూడా తప్పేనంటారా?" ప్రశ్నించాడు. ఆయన ఇంక నవ్వుతూనే వున్నాడు.

"నేనలా అనలేదే... అయినా సుభాష్ చంద్ర బోస్ అహింసా సిద్ధాంతాన్ని నమ్మలేదని నీకు ఎవరు చెప్పారు. నేను, నెహ్రూ, ఠాగూర్ లాంటి వాళ్ళంతా సత్యాగ్రహాన్ని శాంతియితమైన అహింసావాదాన్ని ప్రోత్సహిస్తే, సుభాష్ బోస్, భగత్ సింగ్ లాంటివాళ్ళు సాయుధపోరాటం ద్వారా హింసా మార్గాన్ని ఎంచుకున్నారని నువ్వు అనుకుంటున్నావు. నీకో విషయం చెప్పనా? భగత్ సింగ్ నా శిష్యుడే. అహింసా మార్గాన్ని నమ్మినవాడే. కానీ జలైన్ వాలాబాగ్ సంఘటన తరువాత అహింసా మార్గాన్ని కాదని తనదైన మార్గంలో వెళ్ళాడు. బోసు మాత్రం? నాతో కలిసి కాంగ్రెస్ లో ఒకడిగా వున్నవాడే కదా? అభిప్రాయ బేధాలు వున్నమాట నిజమే కానీ ఇంకో రకంగా చూస్తే మా ఇద్దరిలో పెద్ద తేడా ఏమీ లేదు. అతను అహింసను కాదని సాయుధపోరాటాన్ని ఎంచుకుంటే, నేను సాయుధపోరాటం కాదని సత్యాగ్రహ మార్గాన్ని ఎన్నుకున్నాను. పోరాటం అనివార్యమని ఇద్దరం ఒప్పుకున్నాం. చేరాల్సిన గమ్యం దేశస్వాతంత్ర్యం అని కూడా తెలుసు. ఎంచుకున్న మార్గాలు మాత్రమే తేడా..." ఆయన చెప్తుంటే ఆశ్చర్యంతో అడ్డువచ్చాడు బోసు.

"ఏంటి బాపూజీ? వాళ్ళకు మీకు పోలికా? మీరు మీ సిద్ధాంతాల ద్వారా ఒక దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు" అన్నాడు ఆయన్ని సమర్థిస్తూ.

"నేనూ? నా సిద్ధాంతాలా?" అని నవ్వాడాయన. "నా సిద్ధాంతాలు అంత గొప్పవి అయితే ఈ రోజు నూటాఇరవై ఆరు మంది చనిపోయేవారు కాదు కదా? నా సిద్ధాంతం ఆధారంగా నువ్వు చేస్తున్న పోరాటం సఫలమవ్వాలి కదా?"

"అవును. అవుతుందన్న నమ్మకం వుంది కాబట్టే పోరాడుతున్నాను." అన్నాడు కానీ అతని గొంతులో గౌరవం తగ్గుతున్న విషయం స్పష్టంగా వినపడుతోంది.

"మరి అదేదీ ఇక్కడ పని చెయ్యలేదే?"

" అవును పని చెయ్యలేదు. అయితే?”

"ఆ సిద్ధాంతాలను తిరస్కరించు"

“తిరస్కరించమంటారా? అలా ఎలా అనగలుగుతున్నారు?"

"ఏం?"

"అవి నేను నమ్మిన సిద్ధాంతాలు"

"పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోయినా అర్ధంలేని సిద్ధాంతాలను పట్టుకోని వేలాడటం అవివేకం, మొండితనం కూడా" గాంధీజీ చల్లగా నవ్వాడు.

"మీకు లేని మొండితనమా? నిరాహారదీక్షను మించిన మొండితనం ఇంకొకటి వుంటుందా?" బోసు అడిగిన ఈ ప్రశ్నకి బాపూ పసిపిల్లాడిలా నవ్వేశాడు.

"నిజమే. కానీ అది జరగడానికి అవకాశం వున్నప్పుడే సాధ్యమౌతుంది. దండించే తల్లిదండ్రులు వున్న చోట పిల్లాడు అన్నం తిననని మొండికేస్తాడా? అలాంటిదే ఇది కూడా. సిద్ధాంతం చెల్లదన్నప్పుడు వెనక్కి తగ్గడంలోనే వుంది తెలివంతా?"

"పోరాటం చెయ్యమని చెప్పింది మీరే కదా?"

"ఇప్పుడు మాత్రం వద్దని చెప్పట్లేదే? కాకపోతే చేసే విధానాన్ని మార్చమంటున్నాను."

అర్ధం కానట్లు చూశాడు.

"అంటే ఏం చెయ్యమంటారు బాపూ?" అడిగాడు. ఆ మాటలు పూర్తికాకముందే గాంధీజీ క్రమక్రమంగా మాయమైపోయాడు.

"బాపూ, బాపూ" అంటూ అరుస్తూ ముందుకు కదలబోయి ఆగిపోయాడు బోసు. అతనికి ఎదురుగా సుభాష్ చంద్ర బోస్ కనిపించాడు. సరిగ్గా గాంధీజీ నిలబడ్డ స్థలంలోనే నిలబడి వున్నాడు. ఇంతకుముందులా ఆయన తెల్లటి దుస్తులు కట్టుకోని లేరు. యుద్ధానికి సన్నద్ధమైన సిపాయిలా యూనీఫార్మ్ వేసుకోని వున్నాడు.

"ఎలా పోరాడాలో నేను చెప్పనా?" అన్నాడాయన.

★★★

కళ్ళు తెరిచిన బోస్ మస్తిష్కంలో వందశరాఘాతాల నొప్పి తెలుస్తోంది. జరిగినదంతా లీలగా గుర్తుకొచ్చింది. మహాధినేత వామదేవుడు తన కత్తి పిడితో తలమీద మోదటం, వెనువెంటనే స్పృహతప్పటం కూడా జ్ఞాపకానికి వచ్చింది. మరుక్షణం తేరుకోని లేచి నిలబడి తన ఒర మీద చేతిని వేసి కత్తిని బయటికి లాగబోయాడు.

ఆ స్థానంలో కత్తి లేకపోవటంతో ఖాళీ పిడికిలి మాత్రం పైకి చాచి ముఖం ముందు పెట్టుకున్నాడు. ఎదురుగా శత్రువుకూడా లేకపోవటం గమనించి, అప్పుడు పరిసరాలను పరికించి చూశాడు. అది తాను నివసించే ప్రాసాదం అని తెలియగానే కాస్త స్థిమితపడ్డాడు. మళ్ళీ నిస్సత్తువ, తలలో బాధ కమ్మేయడంతో మంచం మీద కూలబడ్డాడు. బాధగా తలపట్టుకున్నాడు

"ఇక ఇతను నాయకుడుగా వుండటానికి అనర్హుడు" అన్న మాటలు విని మళ్ళీ తేరుకున్నాడు. ఆ గొంతు చాలా సుపరిచితమైనదిగా అనిపించడంతో వెంటనే నిలబడి, చప్పుడు కాకుండా నెమ్మదిగా నడుస్తూ గది గుమ్మం దగ్గరకు చేరుకున్నాడు.

"అంత మాట అనకు. నాయకుడంటే తప్పులే చెయ్యని దేవుడు కాదు. ఆయన కూడా మనిషే. తప్పులు అందరూ చేస్తారు" అంది రెండో గొంతు. కొద్దిగా ముందుకు వంగి ఆ గొంతులు ఎవరివో పరిశీలించాడు.

పశుపాల, సుధామ. ఇద్దరిలో ఎవరు ఏ మాట అన్నారో అర్థం కాలేదు. అలికిడి అయితే వాళ్ళు గమనిస్తారని వెంటనే వెనక్కి తగ్గాడు. అయినా అతనిలో ఆ ఉత్సుకత తగ్గలేదు.

"భవిష్యగ్రంథం ప్రకారం ఈయన మనల్ని కాపాడటానికి వచ్చిన అవతారమనే అందరూ నమ్ముతున్నారు. సరే నువ్వు చెప్పినట్లు ఆయన దేవుడు కాదనే అనుకుందాం. అలాంటప్పుడు నాయకత్వం ఒప్పుకోవడం ఎందుకు. ఒకసారి నాయకత్వం ఒప్పుకున్న తరువాత తన వారిని, సైన్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అతనికి లేదా? కనీసం ఇప్పుడు నైతిక విలువలతో పదవీ త్యాగం చేసి వెళ్ళాలి కదా?" అడుగుతున్నాడతను. ఆశ్చర్యపోయాడు బోసు. ఆ మాటలు విన్నందుకు కాదు. ఆ మాటలు అంటున్న వ్యక్తి ముఖాన్ని చూసిన తరువాత. అతను పశుపాల.

ఒక్క ఉదుటున గుమ్మం దాటి బయటికి వచ్చాడు.

"మహాబసూ" అంటూ భయంతో వణికిపోయాడు పశుపాల. సుధామ కూడా క్షణకాలం అదిరిపడి వెనక్కి అడుగువేశాడు.

"భయం లేదు పశుపాలా... నీ మాటలు మొత్తం విన్నాను. నువ్వన్న మాటల్లో సత్యాన్ని గ్రహించాను. రేపే సర్వసభ్యసమావేశాన్ని ఏర్పాటు చెయ్యి" అని చెప్పి వెంటనే వెనక్కి తిరిగాడు.

జరిగినదేమిటో అర్థం చేసుకున్న పశుపాల, సుధామ తేరుకునేలోగా నాలుగైదడుగులు ముందుకెళ్ళిపోయాడు. అయినా ముందుకొచ్చి ఏదో చెప్పబోయిన పశుపాలని వారిస్తూ చెయ్యడ్డం పెట్టాడు సుధాముడు.

★★★

"సత్యోద్యమకారులందరికీ మీ మహాబసు నమస్కారం. ఈ రోజు మీకు ఓ నిష్ఠూరమైన యదార్థాన్ని చెప్పాలని ఈ సమావేశానికి పిలిపించాను. ఆ నిజాన్ని చెప్పిన తరువాత ఈ ఉద్యమ నాయకత్వం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను." అంటూ మొదలుపెట్టాడు బోసు.

జనంలో కలకలం మొదలైంది. అందరి మనసుల్లో వున్న ఆందోళన ప్రశ్నార్థకాలై ఒకరితో ఒకరు చర్చించుకునేలా చేసింది.

"ఆగండి మిత్రులారా..! నేను చెప్పబోయే అసలు విషయం వినండి. అదేమిటంటే – నేను మహాబసుని కాదు" అంటూ మరింకేదో చెప్పబోయాడు బోసు. మరుక్షణం ద్వీప, ఉగ్ర అతనిని వారించడానికి ముందుకు రాబోయారు. వారితోపాటే వచ్చి, వారి సరసన కూర్చున్న ఆచార్య వేదాంతం ఆపడంతో ఆగిపోయారు. ఆయన చిన్నగా నవ్వుతూ బోసు ప్రసంగం వినసాగాడు.

ఈ లోగా అక్కడ నిలబడ్డ ఉద్యమకారులంతా ఒక్కసారి నిస్సత్తువ ఆవహించినట్లు నీరసించిపోయారు. ఇన్నాళ్ళు ఎవరు తమకి అండగా వున్నాడని నమ్మారో, ఏ శక్తి తమ విజయాన్ని నిశ్చయం చేస్తుందని విశ్వసించారో అలాంటి వ్యక్తి స్వయంగా తాను వాళ్ళు ఊహించిన శక్తి కాదని చెప్తుంటే పరాజయం పరిహాసమాడినట్లు, మృత్యువు ముందు నిలబడి నవ్వుతున్నట్లు అనిపించసాగింది.

"అవును నేను మహాబసుని కాదు. ఒకవేళ నేను మహాబసుని అయ్యుంటే నిన్న నూటాఇరవైఎనిమిది మంది ఉద్యమకారుల ప్రాణాలను పోగొట్టుకునేవాణ్ణి కాదు. మీరు అనుకుంటున్నట్లు నేనే అవతార పురుషుణ్ణి అయివుంటే ఈ రక్తపాతం జరిగేది కాదు. ఒకవేళ నేను మీరు అనుకుంటున్న మహాబసుని అయినా సరే, ఇంతమంది శరీరాల నుంచి స్రవించిన రక్తానికి నేను జవాబుదారీ కాక తప్పదు. ఇందుకు పూర్తి బాధ్యత నేనే వహించాల్సివుంటుంది. ఏమో, నేను తటస్థించి వుండకపోతే మీరంతా ఉగ్ర నేతృత్వంలో సాయుధపోరాటం చేస్తూ బ్రతికేవారేమో. ఇప్పుడు శాంతి అనీ, అహింస అనీ మీ కాళ్ళకు చేతులకు సంకెళ్ళు వేసి మరీ ఈ ఉద్యమంలోకి లాగుతున్నాను. ఆ కారణంగా బలైపోతున్న ప్రాణాలకు బాధ్యవహించాలి కదా! అందుకే నేను ఈ పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. కానీ నేను నమ్మిన ఒక సిద్ధాంతం కోసం మీతో పాటుగా సైనికుడినై సేవలందించాలని మాత్రం అనుకుంటున్నాను" అంటూ ముగించాడు.

అతను కాస్త వెనక్కి జరిగి ఎదురుగా వున్న ప్రజావాహిని వైపుప్ చూశాడు. వెంటనే అతని చూపు  జనం వెనుకగా ఉన్న వ్యక్తులపై పడింది. వాళ్ళు దళాధిపతి మనుషులని వెంటనే తెలిసిపోయింది. ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేసే అవకాశం కూడా లేకుండా పోయిందని అతనికి అర్థం అయిపోయింది. తన కళ్ళముందే వందల కొద్దీ మనుషులు చనిపోవడం అనివార్యమని అతనికి అనిపించసాగింది.

సరిగ్గా అదే సమయంలో ఉగ్ర ముందుకొచ్చి తన ప్రసంగాన్ని ప్రారంభించాడు.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS